ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

ఆదివారం 2 నవంబరు 2025



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కె.అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

త్యాగానికి ప్రతీక.. అమరజీవి పొట్టి శ్రీరాములు

● ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంలో వక్తలు

ప్యారీస్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో శనివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఅవతరణ దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ వేడుకల్లో కమిటీ ఛైర్మన్ కె.అనిల్‌కుమార్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఎం.వి.నారాయణగుప్తా, జే.ఎం.నాయుడు, ఆచార్య విస్తాలి శంకరరావు, డాక్టర్ ఏ.వీ.శివకుమారి, వేణుగోపాల విద్యాలయ ప్రతినిధులు శర్మ, నిర్మల తదితరులు అమరజీవి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష బూని ప్రాణాలు అర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని సభలో పాల్గొన్న వక్తలు స్మరించుకున్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసినందువల్లే దేశంలో తమిళనాడు సహా పలు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా వచ్చిందన్నారు. ఆ మహనీయుడి జయంతి, వర్ధంతిని ప్రతి తెలుగు వ్యక్తి మరవకుండా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం అమరజీవి చేసిన త్యాగం చిరస్మరణీయమని పలువురు కొనియాడారు.

వచ్చేవారం ప్రజల్లోకి విజయ్

● భద్రతకు రిటైర్డ్ పోలీసు అధికారులతో కమిటీ



చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ మళ్లీ పార్టీ వ్యవహారాలపై దృష్టి సారిస్తున్నారు. వచ్చే వారం నుంచి ఆయన ప్రచార పర్యటన చేపట్టనున్నారు. ఈనెల 5న పనయూరులో పార్టీ సర్వసభ్య మండలి సమావేశం జరగనుంది. ఆ సమావేశంలోనే విజయ్ తన ప్రచార పర్యటనకు సంబంధించిన ప్రకటనను జారీ చేయనున్నారు. అదే సమయంలో కరూర్ రోడ్‌షో సందర్భంగా ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఇకపై తాను పాల్గొనే రోడ్‌షోలలో, బహిరంగ సభల్లో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా రిటైర్డ్ పోలీసు అధికారులతో ప్రైవేటు భద్రతా కమిటీని ఏర్పాటు చేయాలని విజయ్ నిర్ణయించారు. ఆ కమిటీలో రిటైర్డ్ డీజీపీ, ఏడీజీపీ సహా 15 మంది మాజీ పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారని సమాచారం. ఈ కమిటీ విజయ్ పాల్గొనే బహిరంగ సభలు, రోడ్‌షోల ప్రాంతాల వద్ద జనాన్ని అదుపు చేస్తారు. అంతే కాకుండా పార్టీ స్థానిక శాఖకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు కల్పించాల్సిన కనీస సదుపాయాపై అవగాహన కల్పిస్తారు. అంతే కాకుండా తమతో కలిసి భద్రతా ఏర్పాట్లు ఎలా చేయాలో వివరిస్తారు. విజయ్ ఆదేశం ప్రకారం ఈ ప్రైవేటు భద్రతా కమిటీ ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన వారికి జనాన్ని క్రమబద్ధీకరించడంపై మాజీ పోలీసు అధికారులు శిక్షణ అందించనున్నారు. పార్టీ యువజన విభాగానికి చెందినవారిలో యువకుడు, యువతి చొప్పున ఇద్దరిని ఎంపిక చేసి ఈ కమిటీ శిక్షణను అందిస్తుంది. ఆదివారం ఉదయం 9 గంటలకు పనయూరులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రస్తుతం భద్రతా కమిటీకి ఎంపికైన మాజీ పోలీసు ఆఫీసర్లు కొందరు వీరికి శిక్షణను ప్రారంభించనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ సమక్షంలో ఈ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఇక ఈ నెల 5న పార్టీ సర్వసభ్యమండలి సమావేశం ముగియగానే విజయ్ తన ప్రచార పర్యటనకు సంబంధించి ప్రకటన జారీ చేయనున్నారు.

గిండిలో ఎకో పార్కు

118 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణ పనులకు స్టాలిన్ శ్రీకారం

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలో 118 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఎకో పార్కు నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ పార్కు వద్ద నీటివనరుల గట్లను పటిష్ఠపరిచే పనులను శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ కొన్ని మొక్కలను నాటారు. గత యేడాది సెప్టెంబరులో స్థానిక గిండిలోని 118 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రాష్ట్ర ఉద్యానవన శాఖకు అప్పగించారు. అదే సమయంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో అక్కడ వర్షాకాలంలో వరద పరిస్థితులను నివారించేందుకు, రహదారుల్లో వరద దృశ్యాలు ఏర్పడకుండా ఉండేందుకు అనువుగా నాలుగు చెరువులను కూడా నిర్మించారు. ఈక్రమంలో అక్కడ అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణాన్ని పెంచిపోషించేలా ఎకో పార్కును నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రులు ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, కార్పొరేషన్ మేయర్ ప్రియ, శాసనసభ్యులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





గిండిలో కొత్త ఎకో పార్కు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రహదారుల ప్రారంభం...

చెన్నై సచివాలయంలో రహదారుల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఈరోడ్, తిరువారూరు, మైలాడుదురై, తంజావూరు, తిరువళ్లూరు, తిరునల్వేలి, అరియలూరు, మదురై జిల్లాల్లో రూ. 1177.15 కోట్లతో నిర్మించిన కొత్త రహదారులను, వేలూరు జిల్లాలో రూ.71.09 కోట్లతో నిర్మించిన రైల్వే ఫ్లైవోవర్లను సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. మంత్రులు ఈవీ వేలు, ఎస్. ముత్తుసామి, ఎస్ఎం. నాజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, రహదారులు శాఖ కార్యదర్శి డాక్టర్ ఆర్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులకు పచ్చజెండా...

సచివాలయం వెలుపల రాష్ట్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో రూ.18.90 కోట్లతో కొనుగోలు చేసిన 87 అంబులెన్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎం. సుబ్రమణ్యం, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ అరుణ్ తంబురాజ్ తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ సంస్థలో నియామకాలు...

సచివాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో టీఎన్‌పీఎస్సీ పరీక్షల ద్వారా ఎంపికైన 24 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి ఎస్. ముత్తుసామి,రాష్ట్ర గృహవసతి, నగరాభివృద్ధి శాఖ కార్యదర్శి కాకర్ల ఉషా, రాష్ట్ర గృహనిర్మాన సంస్థ అధ్యక్షులు పూచ్చి ఎస్. మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

భారతిరాజా కులాసాగానే ఉన్నారు! 7

పార్టీకి ద్రోహం.. అందుకే తొలగించాం!

● ఆరు నెలలుగా అసమ్మతి నేతలతో చెలిమి
● డీఎంకేతోనూ రహస్య సంబంధాలు
● అందువల్లే సెంగోట్టయ్యన్‌పై వేటు
● ఈపీఎస్ ప్రకటన

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా అసమ్మతి వర్గం నేతలతో తిరుగుతూ, పార్టీకి ద్రోహం చేసినందుకే మాజీ మంత్రి సెంగోట్టయ్యన్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. శాసనసభలోనూ, వెలుపలా సెంగోట్టయ్యన్ పార్టీకి వ్యతిరేకంగానే పని చేస్తూ వచ్చారని, పార్టీ నుంచి బహిష్కరించిన నేతలతో ఫోన్లలో మంతనాలు జరిపారని ఆరోపించారు. వీటన్నింటికంటే డీఎంకేతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారని తెలిపారు. సేలంలో శనివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అత్తికడవు - అవినాశి పథకం వల్ల లబ్ధిపొందిన రైతులు తనకు సత్కారసభ జరిపినప్పుడు వేదికపై జయలలిత ఫోటో లేదని సెంగోట్టయ్యన్ చెప్పడం సరికాదన్నారు. ఆ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది రైతు సంఘాలే తప్ప అన్నాడీఎంకే కాదనే విషయం తెలిసి కూడా తనను విమర్శించారని గుర్తు చేశారు. సర్వసభ్య మండలి ద్వారా పార్టీ నుంచి తొలగించిన వారితో ఎవరూ ఎలాంటి సంబంధాలు పెట్టుకోకూడదని తీర్మానం చేశామని, దాన్ని పట్టించుకోకుండా సెంగోట్టయ్యన్ మాజీ సీఎం ఓపీఎస్, అనుచరులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన కారణంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు ఈపీఎస్ స్పష్టం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత సెంగోట్టయ్యన్‌ను మంత్రి పదవి నుంచి, పార్టీ పదవి నుండి తొలగించారని, తాను ముఖ్యమంత్రి అయ్యాక ఆయనకు పార్టీలో మంచి పదవిని ఇచ్చానన్న విషయాన్ని కూడా మరచిపోయి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తుండటం గర్హనీయమన్నారు. పార్టీకి విశ్వాసంగా ఉంటూ దశాబ్దాల తరబడి అభివృద్ధికి పాటుపడినందువల్లే అందరూ ఏకగ్రీవంగా తనను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారని చెప్పారు. శాసనసభలో, వెలుపలా సెంగోట్టయ్యన్ డీఎంకేపై ఎలాంటి విమర్శలు చేయకుండా సీఎం స్టాలిన్‌తో, డీఎంకే నేతలతో సంబంధాలు పెట్టుకున్నారని, ఈ విషయం ప్రజలందరికీ తెలిసిన విషయమేనని ఈపీఎస్ అన్నారు. పార్టీని బలహీనపరిచేందుకు ప్రయత్నించేవారిపై లేదా పార్టీకి అప్రతిష్ఠ తీసుకువచ్చేవారిపై మెతక వైఖరిని అవలంబించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన చెప్పారు. ఆరుమాసాలుగా పార్టీకి వ్యతిరేకంగా పావులు కదుపుతున్న సెంగోట్టయ్యన్‌పై చర్యలు తీసుకోకుండా ఎలా ఉండగలమని ప్రశ్నించారు. జయ మృతి తర్వాత అన్నాడీఎంకే ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన విశ్వాసతీర్మానానికి ఓపీఎస్, ఆయన మద్దతుదారులైన శాసనసభ్యులు వ్యతిరేకంగా ఓటేశారని, పార్టీ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశారని ఈపీఎస్ ఆరోపించారు. జయలలిత బ్రతికి ఉంటే ఓపీఎస్ డీఎంకే నేత స్టాలిన్‌ను ప్రైవేటుగా కలుసుకుని ఉండేవారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఓపీఎస్, దినకరన్‌లతో కలిసి సెంగోట్టయ్యన్ రాష్ట్రంలో మళ్ళీ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. జయ చేత పార్టీ నుండి బహిష్కృతుడైన దినకరన్‌కు అన్నాడీఎంకేను విమర్శించే అర్హత లేదని ఈపీఎస్ మండిపడ్డారు.



దినకరన్, సెంగోట్టయ్యన్ అన్నాడీఎంకేపై చేసిన విమర్శల వీడియోను ట్యాబ్ ద్వారా ప్రదర్శిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

డిస్మిస్‌పై కోర్టుకు వెళ్తా

● అన్నాడీఎంకే బహిష్కృత నేత సెంగోట్టయ్యన్



ప్యారీస్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నుంచి తనను తొలగించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు ఆ పార్టీ బహిష్కృత నేత కే.ఏ.సెంగోట్టయ్యన్ పేర్కొన్నారు. అన్నాడీఎంకే విధానాలు, లక్ష్యాలు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా సెంగోట్టయ్యన్ వ్యవహరించారని కారణం చూపి ఆయనను పార్టీ నుంచి తొలగిస్తూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సెంగోట్టయ్యన్‌ను పార్టీ కనీస సభ్యత్వం సహా అన్ని బాధ్యతల నుంచి తొలగించినట్లు ఈపీఎస్ శుక్రవారం అధికారపూర్వకంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో, తనను అన్నాడీఎంకే నుంచి తొలగించడం పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకమని, దీనిపై కోర్టుకు వెళతానని సెంగోట్టయ్యన్ పేర్కొన్నారు. ఆయన ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయంలో శనివారం ఉదయం మీడియాతో మాట్లాడారు. అన్నాడీఎంకేలో 1972 నుంచి పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి చేసిన కృషివల్లే పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్ తనను ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ఈపీఎస్ పార్టీలోకి రాకముందే తాను ఎమ్మెల్యేనని ఆయన గుర్తుచేశారు. ఎంజీఆర్ మరణానంతరం పార్టీ పగ్గాలు చేపట్టిన జయలలిత.. పార్టీ కోసం లాభాల్ని ఆశించకుండా పనిచేసిన వారిని ఎన్నడూ కించపరచలేదన్నారు. కొడనాడు కేసులో ఏ1 నిందితుడు అన్న వాస్తవాన్ని మరచిన ఈపీఎస్ తనను డీఎంకే బీ టీం అని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ద్రోహానికి నోబెల్ బహుమతి ఇవ్వాలనుకుంటే దాన్ని ఈపీఎస్‌కు ప్రదానం చేయవచ్చని సెంగోట్టయ్యన్ ఎద్దేవా చేశారు.

మాజీ మంత్రి షణ్ముగానికి మహిళా కమిషన్ నోటీసులు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం విచారణకు హాజరుకావాలని రాష్ట్ర మహిళా హక్కుల కమిషన్ నోటీసులు జారీచేసింది. విల్లుపురంలో కొద్దిరోజుల క్రితం జరిగిన అన్నాడీఎంకే బూత్ కమిటీల సమావేశంలో పాల్గొన్న షణ్ముగం.. మహిళలను ఉచిత పథకాలతో అనుసంధానం చేస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలను పలు పార్టీ నేతలు ఖండించారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి గీతా జీవన్ స్పందిస్తూ... అన్నాడీఎంకేకు మహిళలపై ఉన్న ద్వేషాన్ని మాజీ మంత్రి షణ్ముగం వ్యాఖ్యలు ఉదాహరణగా ఉన్నాయన్నారు. ఈ వ్యాఖ్యలను ఎడప్పాడి పళనిస్వామి ఇంటి మహిళలు ఎలా భావిస్తారు? అంటూ తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన షణ్ముగంపై పళనిస్వామి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ క్రమంలో, మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించిన సీవీ షణ్ముగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత మహిళా సమాఖ్య (ఐద్వా) రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో గత నెల 17వ తేది విచారణకు హాజరుకావాలని కమిషన్ నోటీసులు జారీచేయగా, షణ్ముగం తరఫున హాజరయ్యేందుకు మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, మహిళా కమిషన్, ఈ నెల 7వ తేది ఉదయం 11 గంటలకు హాజరుకావాలని రెండో సారి షణ్ముగంకు నోటీసు జారీచేసింది.



రాష్ట్రంలో మరో 38 ప్రాంతాల్లో 'హెల్త్‌వాక్'లు

● మంత్రి సుబ్రమణ్యం ప్రకటన

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 38 ప్రాంతాల్లో 'హెల్త్‌వాక్' పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఉదయం వేళచ్చేరి - తరమణి ఎంఆర్టీఎస్ రోడ్డులో చెన్నై కార్పొరేషన్, తమిళనాడు సైక్లింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 3 కిలోమీటర్ల పాదయాత్ర, 6 కిలోమీటర్ల సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సుమారు 200 మంది దాకా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచినవారికి మంత్రి సుబ్రమణ్యం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతొ మాట్లాడుతూ నడకతో ఆరోగ్యపరంగా కలిగే ప్రయోజనాలు గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గత యేడాది నవంబర్ 4న రాష్ట్ర ప్రభుత్వం 'హెల్త్‌వాక్' పథకం కింద 38 రెవెన్యూ జిల్లాలో 8 కిలోమీటర్ల పొడవు కాలినడక రహదారులను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇదే విధంగా మరో 38 ప్రాంతాల్లో 'హెల్త్‌వాక్' పథకం కింద కొత్తగా కాలినడక రహదారులను నిర్మించనున్నామని ఆయన తెలిపారు.

ఎన్నెల్సీలో ముగిసిన అవగాహన ప్రచారం



నైవేలి టౌన్‌షిప్‌లో వాకర్స్ పార్కును ప్రారంభిస్తున్న ఎన్నెల్సీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నైవేలిలోని ఎన్నెల్సీ ఇండియాలో వివిధ రంగాల్లో పారదర్శకమైన పాలన, నిర్వహణ పద్ధతులు పాటించి, సామాజిక సేవలందించి నెల రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమం 5.0 శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతలో భాగంగా పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం, కార్యాలయాల్లో పెండింగ్‌ను తగ్గించి సామర్థ్యాన్ని సంస్థాగతీకరించడం ద్వారా పాలనను మెరుగుపరచడం అనే లక్ష్యంతో ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమం 2022లో ప్రారంభమైంది. కేంద్ర బొగ్గుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచనల మేరకు ఈ ప్రత్యేక అవగాహన ముమ్మర ప్రచార కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసినట్లు ఎన్నెల్సీ సంస్థ ఈఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నైవేలి టౌన్‌షిప్‌లో ప్రజలకు కొత్త సదుపాయాలను ప్రారంభించారు. బ్లాక్-13లో వాకర్స్ పార్కును కూడా ప్రారంభించారు.



తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, చండీఘర్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, కర్ణాటక, కేరళ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, అండమాన్-నికోబార్ దీవులు, జమ్మూ-కశ్మీర్, లక్షదీవులు, పుదుచ్చేరి, లడాఖ్ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం రాజ్‌భవన్‌లో 'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' పేరుతో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను ఆసక్తిగా వీక్షిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

సమాచార దృష్టి

రూ.4.50 తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.4.50 తగ్గి రూ.1,750కి విక్రయమవుతోంది. ఇండియన్ ఆయిల్, హిందుస్తాన్ పెట్రోలియం, భారత్ తదితర సంస్థలు ఇళ్లకు 14.20 కిలోలు, వాణిజ్య వినియోగానికి 19 కిలోల గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నాయి. ఈ సంస్థలు, అంతర్జాతీయ ముడిచమురు ధరలకు అనుకూలంగా ప్రతినెలా గ్యాస్ సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తుంటాయి. ఈ ప్రకారం, ఈ నెల 1వ తేది నుంచి వాణిజ్య వినియోగ సిలిండర్ ధర రూ.4.50 తగ్గింది. సెప్టెంబరు 1వ తేది రూ.51.50 ధర తగ్గిన నేపథ్యంలో, అక్టోబరులో రూ.16 పెరిగింది. ఇక, ఇంటి గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పులు లేకుండా రూ.868.50కి విక్రయమవుతోంది.

అక్టోబరులో 36 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్టోబరులో సాధారణం కన్నా 36 శాతం అదనపు వర్షపాతం నమోదైందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈశాన్య రుతుపవనాలతో ఏటా రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదవుతోంది. ప్రతి ఏడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో 44 సెం.మీ వర్షపాతం నమోదవుతుండగా, అక్టోబరులో మాత్రమే 18 సెం.మీ వర్షపాతం నమోదవుతోంది. ఏడాది అక్టోబరు 16న ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కాగా, 1వ తేది నుంచి కురిసిన వర్షాలకు, ఈశాన్య రుతుపనాలను కలిపి గణించారు. ప్రకారం, అక్టోబరులో 18 సెం.మీ సాధారణ వర్షపాతం కాగా, ఈ ఏడాది 23 సెం.మీ వర్షపాతం నమోదైంది. చెన్నైలో గత నెలలో సాధారణ వర్షపాతం 27 సెం.మీ కాగా, ఈ ఏడాది 29 శాతం అదనంగా అంటూ 35 సెం.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

'మహిళా ప్రోత్సాహక నిధి' దరఖాస్తుకు తుది అవకాశం

పెరంబూర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రోత్సాహక నిధి రూ.1000 దరఖాస్తు చేసుకోనివారికి రాష్ట్రప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. ప్రస్తుతం 1.16 కోట్ల మందికి ఈ నిధి అందుతోంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో, ఈ పథకంలో మరింత మందిని చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ఉంగళుడన్ స్టాలిన్ శిబిరాల్లో ఈ పథకంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించగా, 25 లక్షల మంది దరఖాస్తులు సమర్పించారు. వాటిని పరిశీలించి, అర్హులైన వారికి డిసెంబరు 15వ తేది నుంచి ప్రోత్సాహక నిధి అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకంలో ఇంకా దరఖాస్తు చేసుకోని వారికి ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. ఆ ప్రకారం, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

ఆర్టీఈ పథకంలో 70,449 విద్యార్థులకు అడ్మిషన్లు


పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్బంధ విద్యా హక్కు (ఆర్టీఈ) పథకంలో, ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో 70,449 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్టు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి చంద్రమోహన్ పేర్కొన్నారు. నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేలా, 7,177 ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, 1వ తరగతి అడ్మిషన్లను దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించగా, 82,000 మంది దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. గత రెండు రోజులుగా డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయగా, 7,717 పాఠశాలల్లో 70,350 మంది విద్యార్థులు ఎల్‌కేజీ, 99మంది 1వ తరగతిలో అడ్మిషన్లు పొందారని తెలిపారు. ఈ విద్యార్థుల ఫీజును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణకు నవంబరు నెల అనుకూల సమయాన్ని ఆలయ అధికారులు ప్రకటించారు. భక్తులు అన్నామలై కొండ చుట్టూ ఉన్న 14 కి.మీ గిరి ప్రదక్షిణ చేసి, స్వామివారిని దర్శించుకుంటారు. నవంబరు పౌర్ణమి ఘడియలు ఈనెల 4వ తేది రాత్రి 10.36 గంటలకు ప్రారంభమై, మరుసటిరోజు ఉదయం 6.49 గంటల వరకు కొనసాగనున్నాయి. ఈ ఘడియలు గిరి ప్రదక్షిణకు అనుకూలమని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక రైలు...: గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం విల్లుపురం నుంచి తిరువణ్ణామలైకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ రైల్వే పేర్కొంది. విల్లుపురం నుంచి ఈ నెల 4వ తేది ఉదయం 10.10 గంటలకు బయల్దేరే 8 బోగీల అన్ రిజర్వుడు రైలు ఉదయం 11.45 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరోమార్గంలో అదే రోజు మధ్యాహ్నం 12.40 గంటలకు తిరువణ్ణామలైలో బయల్దేరే రైలు 2.15 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. వెంకటేశపురం, మాంబళంపట్టు, ఆయందూర్, తిరుకోవిలూర్, ఆదిశనూరు, అండామ్‌పల్లం, దండరై తదితర రైల్వేస్టేషన్‌లలో ఆగుతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

సినీ దర్శకుడు వి.శేఖర్‌కు తీవ్ర అస్వస్థత



చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'పొండాట్టి సొన్నా కేక్కనుమ్, విరలుకేత్త వీక్కమ్, వరవు ఎట్టణా సెలవు పత్తణా' వంటి కుటుంబ కథా చిత్రాలను తమిళ ప్రేక్షకులకు అందించిన ప్రముఖ సినీ దర్శకుడు వి.శేఖర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజులకు ముందు ఆయన గుండె నొప్పి రావటంతో చికిత్స నిమిత్తం పోరూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యనిపుణులు ఆయనకు చికిత్సలందిస్తున్నారు. ఈ విషయమై శేఖర్ తనయుడు కార్ల్‌మార్క్స్ శేఖర్ ఓ ప్రకటన జారీచేస్తూ... తన తండ్రి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్సలందుకుంటున్నారని, ఆయన త్వరగా కోలుకోవాలని అందరూ భగవంతుని ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా ప్రయోజన వ్యాజ్యం సర్వరోగ నివారిణి కాదు

● మద్రాసు హైకోర్టు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్ని తప్పులకు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దివ్య ఔషధం కాదని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఢిల్లీకి చెందిన ఆదిత్య మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో... తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విచారించగా, ఎఫ్‌ఐఆర్ ఆధారంగా చార్జిషీటు దాఖలు చేసినట్లు పోలీసు శాఖ తెలిపిందని, ఆ వాదన అంగీకరించిన న్యాయమూర్తి, తన పిటిషన్ కొట్టివేశారని పేర్కొన్నారు. అనంతరం, ఛార్జిషీటు నకలుకు దరఖాస్తు చేసుకోగా, ఛార్జిషీటు దాఖలు చేయలేదని పేర్కొంటూ దరఖాస్తు తిరిగి అందించారని తెలిపారు. అందువల్ల, న్యాయస్థానానికి తప్పుడు సమాచారం అందించిన ప్రభుత్వ న్యాయవాది, పల్లికరనై సీఐపై చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జి.అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం... న్యాయస్థానానికి తప్పుడు సమాచారం అందించి ఉంటే, అందుకు తగిన ఆధారాలు ఉన్న సమయంలో, పిటిషనర్ చట్టపరమైన చర్యలు చేపట్టవచ్చు. అందుకు బదులుగా, ప్రభుత్వ న్యాయవాది, పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వ్యక్తిగత కారణాలతో దాఖలుచేసిన ఈ పిటిషన్‌ను ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణించలేమని పిటిషన్ కొట్టివేస్తున్నట్లు తెలిపింది. అలాగే, ప్రజా ప్రయోజన వ్యాజ్యం అన్ని తప్పులకు సర్వరోగ నివారిణి కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టులను ఆశ్రయించలేని వారి సమస్యల కోసం ఇతరులు న్యాయస్థానం ఆశ్రయించేందుకు ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఉందని, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించుకొనేలా వినియోగించుకునేందుకు అనుమతించమని తేల్చి చెప్పింది. న్యాయస్థానాల్లో తప్పుడు సమాచారం ఇవ్వకుండా నిరోధించడానికి ఇప్పటికే చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని, ఈ విషయంలో నియమాలు రూపొందించడం ప్రభుత్వ పరిధిలోనిదని, పిటిషనర్ తన ఫిర్యాదుల పరిష్కారానికి తగిన సంస్థను సంప్రదించవచ్చని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

తిరువణ్ణామలై ఆలయంలో విదేశీ భక్తుల 'స్వచ్ఛభారత్'



ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విదేశీ భక్తులు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో విదేశీ భక్తులు 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం చేపట్టారు. ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయానికి ప్రతిరోజు రాష్ట్రం నలుమూలు, పొరుగు జిల్లాల నుంచే కాకుండా విదేశాలనుంచి కూడా భక్తులు వస్తుంటారు. పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ప్రపంచంలోనే ప్రసిద్ధిచెందిన అరుణాచలేశ్వర స్వామి ఆలయ కార్తీక దీపోత్సవం ఈనెల 24వ తేది ప్రారంభమై 10 రోజులు జరగనున్నాయి. 10వ రోజైన డిసెంబరు 3వ తేది ఉదయం ఆలయ ప్రాంగణంలో భరణి దీపం, ఆలయం వెనుక అన్నామలైయార్ కొండ శిఖరంపై మహాదీపం వెలిగించనున్నారు. ప్రస్తుతం కార్తీక దీపోత్సవ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనుల్లో చెన్నైకి చెందిన ఆలయాల శుభ్రతా పనుల సంస్థకు చెందిన 150 మంది బృందం పనులు చేపట్టింది. ఈ బృందంతో స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన మహిళలు సహా 30 మంది పాల్గొన్నారు.

తోడర్ కులస్తుల ఎంబ్రాయిడరీ ఉత్పత్తుల విక్రయం

మహిళ అరెస్ట్



గిరిజన మహిళలను బెదిరించిన షీలా

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భౌగోళిక గుర్తింపు పొందిన తోడర్ ఎంబ్రాయిడరీ ఉత్పత్తులు, బయటి వ్యక్తులు తయారచేసి విక్రయిస్తున్న వ్యవహారంలో, ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. నీలగిరి జిల్లాలో తోడర్ గిరిజన ప్రజలు మండు అనే ప్రాంతంలో నివసిస్తున్నారు. మహిళలు 'బూత్తుకుళది' అని పిలిచే దుప్పట్లు, స్వెట్టర్లు, మఫ్లర్లు అల్లి విక్రయించడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ప్రత్యేకతతో కూడిన వీరు తయారుచేసిన ఎంబ్రాయిడరీ జనపనారు ఉత్పత్తులకు 2008లో భౌగోళిక గుర్తింపు హోదా లభించింది. ఈ క్రమంలో, ఊటీకి చెందిన తోడర్ వర్గానికి చెందని షీలా కార్మికులను నియమించుకుని జనపనార ఉత్పత్తులు తయారుచేసి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులందాయి. దీంతో తాము జీవనాధారం కోల్పోతున్నామంటూ తోడర్ గిరిజన మహిళలు గత నెల 6వ తేది ఊటీ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. ఈ వ్యవహారంపై తోడర్ మహిళలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న షీలా తదితరులతో 11వ తేది పోలీసులు మాట్లాడారు. ఆ సమయంలో తోడర్ మహిళలను దుర్భాషలాడిన షీలా, వారిని హత్య చేస్తానని బెదిరించింది. దీంతో షీలాపై చర్యలు చేపట్టాలంటూ ఊటీ నగర సెంట్రల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం షీలాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి కోయంబత్తూర్ కేంద్ర కారాగారానికి తరలించారు.

ఘనంగా పదవీ విరమణ వేడుకలు



సత్కరిస్తున్న విశ్వకర్మ సంఘు నిర్వాహకులు

తిరుత్తణి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ)లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి ఇటీవల పదవీవిరమణ పొందిన సయ్యద్ కరీముల్లాను తిరువళ్లూరు జిల్లా విశ్వకర్మ సంఘ నిర్వాహకులు శనివారం ఉదయం ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన సుమారు 50 మంది కార్పెంటర్ వర్క్స్ చేస్తున్న విశ్వకర్మ సంఘ సభ్యులకు సంక్షేమ సహాయాలను అందజేశారు. అనంతరం సంఘ సభ్యులు రవి ఆచారి, కేశవులు ఆచారి, పార్తిబన్ ఆచారి, విక్రమ్, సతీష్, సురేష్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం సమర్పించి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉధృతంగా కుశస్థలి నది



కృష్ణాపురం ఆనకట్ట వద్ద వరద ఉధృతి

తిరుత్తణి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కుశస్థలి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాపురం జలాశయంనుంచి నుంచి శనివారం ఉదయం 300 క్యూసెక్కుల నీటిని నీటి పారుదలశాఖ విడుదల చేసింది. దీంతో తిరుత్తణి సమీపంలోని కుశస్థలి నదిలో శనివారం మధ్యాహ్నం నీటి ఉధృతి అధికమైంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల వారిని ప్రజా పనులశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. అదేవిధంగా పళ్లిపట్టులోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు వంతెనలపై నీరు ప్రవహిస్తోంది. దీనితో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు వంతెనల ముందు 'నో ఎంట్రీ' బోర్డులు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వంతెన లేకపోవడంతో తన గ్రామాలకు చేరుకోవాలంటే దాదాపు 20 కిలోమీటర్ల దూరం మేరకు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ



సహాయాల పంపిణీ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ నిర్వాహకులు

వేలూరు, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో శనివారం ఉదయం పేదలకు సంక్షేమ సహాయాల పంపిణీ జరిగింది. రెడ్‌క్రాస్ పితామహుడు జాన్ హెంబ్రీ 115వ జ్ఞాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు జనార్దనన్ అధ్యక్షత వహించారు. అనంతరం కమిటీ నిర్వాహకుడు రమేష్‌కుమార్... రెడ్‌క్రాస్ పితామహుడు జాన్ హెంబ్రీ సమాజానికి చేసిన సేవలను వివరించారు. 100 మంది పేదలకు సంక్షేమ సహాయాలను వారు అందజేశారు.

యువతి ఆత్మహత్య



దిలీప్‌తో హరిత (పాతచిత్రం)

తిరుత్తణి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు వివాహానికి నిరాకరించాడనే కారణంతో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో జరిగింది. తిరుత్తణిలోని ఓ ప్రైవేటు డిప్లొమా కళాశాలలో నర్సింగ్ చదువుతున్న హరిత (22)కు రెండేళ్ల క్రితం తన బంధువుల పెళ్లి వేడుకల్లో బెంగళూరులో లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దిలీప్ (25) పరిచయమయ్యాడు. తక్కువ సమయంలోనే ఈ పరిచయం ప్రేమగా మారింది. దీంతో వారిద్దరూ గత కొన్ని నెలలుగా సన్నిహితంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, పెళ్లి చేసుకోమని హరిత అడగడంతో దిలీప్ నిరాకరించినట్లు సమాచారం. దీంతో హరిత శుక్రవారం సాయంత్రం తన ఇంట్లో దిలీప్‌ని ప్రేమించానని, అతని పూర్తి వివరాలు లేఖలో రాసి గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కాసేపటికి దీనిని గమనించిన ఆమె తల్లి కళావతి ఇరుగుపొరుగు వారిని పిలిచి హరితను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఇదిలా వుండగా, పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు నిరాకరించిన కుటుంబ సభ్యులు హరిత ఆత్మహత్యకు కారణమైన దిలీప్‌ను అరెస్ట్ చేయాలంటూ ఆస్పత్రి ముందు బైఠాయించారు.

కలెక్టర్, ఎస్పీల మహానాడు వాయిదా

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 5,6 తేదీల్లో జరగాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మహానాడు వాయిదాపడింది. యేటా రెండు రోజులు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారుల మహానాడు ముఖ్యమంత్రి నేతృత్వంలో జరుగుతుంది. జిలాల్లో ప్రభుత్వ పథకాల అమలు, శాంతి భద్రతలు సమస్యలపై సమావేశంలో చర్చిస్తుంటారు. అలాగే, అధికారులకు ముఖ్యమంత్రి సలహాలు అందిస్తుంటారు. ఈ క్రమంలో, ఈ ఏడాది మహానాడు ఈనెల 5, 6 తేదీల్లో స్థానిక సచివాలయం ప్రాంగణంలోని నామక్కల్ కవింజర్ మాళిగైలో జరుగుతుందని ప్రకటించారు. కానీ, ఈ సమావేశం వాయిదా వేసిన ట్లు, తదుపరి నిర్వహించే తేదీలు త్వరలో ప్రకటిస్తామని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

కామరాజ్ వర్శిటీ ప్రొఫెసర్ల ఆందోళనల ఉపసంహరణ

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు చేపట్టిన ఆందోళన ఉపసంహరించుకున్నారు. సర్వీసు ఆధారంగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ రెండు రోజుల క్రితం నిరవధిక ఆందోళనలు చేపట్టారు. ఆందోళన చేపట్టిన ప్రొఫెసర్లతో వర్శిటీ యాజమాన్యం చర్చించింది. 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ప్రకటించింది. దీంతో ఆందోళన విరమిస్తున్నట్లు ప్రొఫెసర్లు ప్రకటించారు.

5న శివాలయంలో అన్నాభిషేకం

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పడునెల్లిలోని శివాలయంలో ఈనెల 5వ తేది అన్నాభిషేకం జరగనుంది. ఈ గ్రామంలో ప్రసిద్ధిచెందిన వడివుడైయాంబాళ్ సమేత చంద్ర మౌళీశ్వరుడి ఆలయం ఉంది. ఐపసి నెల పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5వ తేది ఈ ఆలయంలో అన్నాభిషేకం జరగనుంది. అలాగే, విశాఖకుప్పం శక్తీశ్వర ఆలయం, ఉళ్లవూరులోని అగతీశ్వర ఆలయం లోనూ 5వ తేది అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసేందుకు బిహారీయుల పయనం

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న బిహారీయులు తమ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసేందుకు బయల్దేరి వెళ్తున్నారు. పారిశ్రామిక నగరంగా పేరొందిన తిరుప్పూర్‌లో 5 వేలకు పైగా రెడీమేడ్ దుస్తుల కర్మాగారాలు, సంబంధిత పరిశ్రమలు పనిచేస్తున్నా యి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, ఉత్తరాది రాష్ట్రా లకు చెందిన వారు ఈ కర్మాగారాల్లో పనిచేస్తున్నారు. వారిలో బిహార్ రాష్ట్రానికి చెందిన సుమారు లక్ష మంది కార్మికులు తిరుప్పూర్ బస చేస్తూ వివిధ పరిశ్రమలు, కర్మాగారాల్లో పనిచేస్తున్నారు. వారిలో బిహారీ కార్మికులు దీపావళి పండుగ సందర్భంగా సొంత రాష్ట్రానికి వెళ్లిన నేపథ్యంలో, మిగిలిన వారు ఈ నెల 6, 11 తేదీల్లో రెండు విడతలుగా జరుగనున్న ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వెళ్తున్నారు. రెండు రోజులుగా బిహార్ రాష్ట్రానికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ రాష్ట్రానికి చెందిన కార్మికులతో కిక్కిరిసి వెళుతున్నాయి.

ఆర్టీఐ పిటిషన్లకు ఆన్‌లైన్ ద్వారా సమాధానం

● పాఠశాల విద్యాశాఖ

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన వివరాలు, ఆర్టీఐ అనే సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నలు అడిగే వారికి, ఆన్‌లైన్ ద్వారా సమాధానం తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయమై జిల్లా ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ పంపిన సర్క్యులర్‌లో వివరాలు ఇలా ఉన్నాయి... జిల్లా ప్రధాన విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత, మహోన్నత పాఠశాలల ప్రజా సమాచార అధికారులు, అప్పీలేట్ అధికారి సహా ఆర్టీఐ పిటిషనర్ల బాధ్యతలు నిర్వహించే వారికి ప్రతిస్పందన తెలియజేసేలా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించామన్నారు. ఈ యూజర్ నేమ్ సురక్షితంగా నిర్వహించడానికి, సంబంధిత అధికారులు, తమ కోసం ఒక రహస్య కోడ్ సృష్టించుకుని, ఆర్టీఐ పిటషన్లకు https://rtionline.tn.gov.in/RTIMS/NODAL/ index.php ద్వారా సమాధానం తెలియజేయాలి. ఇందుకు సంబంధించిన నివేదిక ప్రతి నెలా 5వ తేదిలోపు ఉన్నతాధికారులకు పంపించాలి. ప్రధాన విద్యాధికా రులకు ఆ నివేదికలను 10వ తేది లోపు పాఠశాల విద్య డైరెక్టరేట్‌కు సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్‌లో తెలియజేసింది.

నేడు 'సర్'పై అఖిల పక్ష సమావేశం

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టనున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ డీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం జరగనుంది. రాష్ట్రంలో ఈ నెల 4వ తేది నుంచి సర్ చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటనపై అధికార డీఎంకే, కూటమి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బిహార్‌లో చేపట్టినట్లు, రాష్ట్రంలో కూడా ఓటర్లను తొలగించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టిందని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సర్‌ను వ్యతిరేకిస్తూ డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. స్థానిక టి.నగర్ అకార్డ్ ఫైవ్ స్టార్ హోటల్‌లో నిర్వహించనున్న సమావేశానికి డీఎంకే కూటమి పార్టీలు సహా 60 పార్టీల నేతలను స్వయంగా కలుసుకుని డీఎంకే నిర్వాహకులు ఆహ్వాన లేఖలు అందజేశారు. కాగా, ఈ సమావేశానికి అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే (అన్బుమణి వర్గం) మాత్రం డీఎంకే ఆహ్వానించలేదు.

రైల్వే వంతెన ప్రారంభం



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

వేలూరు, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలోని మేలత్తూరు, వలత్తూరు రైల్వేస్టేషన్లకు వెళ్లే మార్గంలో రాష్ట్రప్రభుత్వం రూ.35.99కోట్లతో నిర్మించిన వంతెనను సీఎం స్టాలిన్ శనివారం ఉదయం వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు జనార్దనన్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ అధికారులతో కలిసి రహదారి ప్రాంగణంలో మొక్కలు నాటారు. డీఎంకే నాయకుడు గుడియాత్తం సత్యానందం, తహసీల్దార్ శుభలక్ష్మి, జాతీయ రహదారులశాఖ ఇంజనీర్లు ధనశేఖరన్, నోబార్డ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఉత్తరాదివాసుల మృతి



ఇసుకలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న ప్రజలు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా తెన్నిలై సమీపంలో ఎం శాండ్ లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటనలో ముగ్గురు ఉత్తరాదివాసులు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారు. కరూర్ జిల్లా కోడందూర్‌లో క్రషర్‌లో 20 మందికి పైగా ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 5 గంటలకు ఎంసాండ్ లోడుతో కోయంబత్తూర్‌కు లారీ బయల్దేరింది. కరూర్ వెంగమేడుకు చెందిన చందనకుమార్ (41) లారీని నడుపుతున్నాడు. ముదలిగౌండమ్‌పాళయం సమీపంలో వస్తున్న లారీ హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడింది. లారీలోని ఎంసాండ్‌పై కూర్చొని ప్రయాణిస్తున్న ఉత్తరాది రాష్ట్రానికి చెందిన సికిందర్ ఖోడా (21), విద్యానంద ప్రభాకరన్ (47), అజయ్ బంగారా (30) తదతరులు ఎంసాండ్‌లో చిక్కుకుని ఊపిరాడన ఘటనా స్థలంలోనే మృతిచెందారు. వీరితో పాటు ప్రయాణిస్తున్న పల్లేమ్స్ భర్యా గాయపడగా స్థానికులు ఆయన్ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తెన్నిలై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మెట్రోలో గత నెల 93.27 లక్షల మంది పయనం

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో గత నెల (అక్టోబరు)లో 93.27 లక్షల మంది మంది ప్రయాణించినట్టు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) శనివారం పేర్కొంది. అక్టోబరు 1 నుంచి 31వ తేది వరకు మెట్రో రైళ్లలో 93,27,746 మంది ప్రయాణించారని, ఆ నెల 17వ తేది అధికంగా 4,02,010 మంది ప్రయాణించారని తెలిపింది. ప్రయాణికులల్లో ఎన్‌సీఎంసీ సింగార చెన్నై కార్డు ద్వారా 47,59,171 మంది, సీఎంఆర్ఎల్ ట్రావెల్ కార్డు ద్వారా 77,236, సింగల్ జర్నీ పేపర్ క్యూఆర్, టోకెన్ ద్వారా 19,45,259, ఆన్‌లైన్ క్యూ ఆర్ టిక్కెట్ల ద్వారా 2,38,745, వాట్సాప్ (+91-8300086000) ద్వారా 5,25,359, పేటీఎం ద్వారా 3,56,234, ఓఎన్‌డీసీ ద్వారా 8,75,731, ఫోన్‌పే ద్వారా 3,06,705, సీఎంఆర్ఎల్ మొబైల్ యాప్ ద్వారా 62,872, చెన్నై వన్ యాప్ ద్వారా 64,609 మంది టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రయాణించారు. కాగా, గత సెప్టెంబరు నెలలో 1,01,46,769 మంది ప్రయాణించి ఉన్నారు.

బీఎల్వోలకు 'సర్'పై శిక్షణ

వేలూరు, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని వేలూరు కలెక్టర్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (సర్) నిర్వాహణపై జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన బీఎల్వోలకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఉన్నతాధికారులు శరవణన్, కేవీ.కుప్పం తహసీల్దార్ బలరామన్ తదితరులు పాల్గొన్నారు.

'తాయుమానవర్' వయో పరిమితి తగ్గింపు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'తాయు మానవర్' పథకంలో లబ్ధిదారుల వయోపరిమితి 70 నుంచి 65 ఏళ్లకు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు లు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న తాయుమానవర్ పథకం ప్రకారం 70 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందజేస్తారు.ఈ పథకాన్ని ఆగస్టు 12వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ప్రతినెలా 2వ శని, ఆదివారాల్లో రేషన్ సిబ్బంది వాహనాల ద్వారా వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో, ఈ పథకంలో కార్డుదారుల వయోపరిమితి 70 నుంచి 65 ఏళ్లకు తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

5న అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 5వ తేది జరగనుంది. స్థానిక రాయపేట అవ్వై షణ్ముగం రోడ్డులోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఈనెల 5న బుధవారం 10.30 గంటలకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని పార్టీ ప్రధాన కార్యాలయం తెలియజేసింది. కాగా, అన్నాడీఎంకే నుంచి మాజీ మంత్రి సెంగోట్టయన్‌ను తొలగించడం, సెంగోట్టయన్, ఒ.పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్ ఒకటిగా పసుంపొన్ దేవర్ జయంతి వేడుకల్లో పాల్గొనడం తదితరాల మధ్య జరుగనున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నీటమునిగి అన్నాతమ్ముళ్ల మృతి

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన తిరువేర్కాడులో నీటమునిగి అన్నా, తమ్ముడు మృతిచెందారు. రియాజ్ (5), అతని తమ్ముడు రిజ్వాన్ (3) శనివారం మధ్యాహ్నం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. ఒడ్డున కూర్చొని కాళ్లు తడుపుకుంటున్న ఇరువురూ ఊహించని విధంగా నీళ్లలో పడిపోయారు. నీళ్లలో పడిపోవడం గమనించిన చుట్టుపక్కల వారు వారిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని చెరువులో గాలించి మృతదేహాలను వెలికితీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో ద్విచక్రవాహనాన్ని ఏటీఎం వాహనం ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. కొండూరు సమీపంలో వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఏటీఎం వాహనం ఢీకొనడంతో తండ్రి, కుమారుడు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రగాయాలైన తల్లిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ ఘటనలో వాహనం కింద చిక్కిన ద్విచక్రవాహనం సుమారు 20 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నర్సింగ్ విద్యార్థుల ప్రతిజ్ఞ



అడయార్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ రామచంద్ర ఫ్యాకల్టీ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం నర్సింగ్ విద్యార్థులు దీపాలు చేతబట్టి నైటింగేల్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్రాసు మెడికల్ కాలేజ్ అండ్ జాయింట్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (నర్సింగ్) డాక్టర్ ఆర్.శంకర షణ్ముగనాథన్ మాట్లాడుతూ... నర్సులు అంకితభావం, మానవత్వం, గౌరవంగా పని చేయాలన్నారు. బాధల్లో ఉన్న రోగులను ఆత్మీయంగా పలకరిస్తూ, వారికి మనోధైర్యం అందించడంలో నర్సులు కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ సింగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే నళిని సహా 150 మంది నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.





తోట తరణి కుంచె నుంచి జాలువారిన చిత్రాలు



ప్రదర్శనలో పద్మశ్రీ తోట తరణి




ప్రదర్శనలో తోట తరణి, దర్శకుడు మణిరత్నం



సృజనాత్మక కళకు స్ఫూర్తినిచ్చే ప్రదర్శన

● తోట తరణి కుంచె నుంచి జాలువారిన 'చిత్ర ప్రపంచం'

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతకే స్ఫూర్తినిచ్చేలా ప్రముఖ కళాకారుడు పద్మశ్రీ తోట తరణి కుంచె నుంచి జాలు వారిన 'చిత్రాలు' విశేషంగా అలరిస్తున్నాయి. ఔత్సాహికులకు మార్గదర్శకంగా, విమర్శకులన ఆలోచింపజేసేలా 'ఫుట్ నోట్స్ ఆన్ సినిమా' పేరుతో నుంగంబాక్కం కాలేజ్ రోడ్డులోని అలయన్స్ ఫ్రాంసీస్‌లో ఏర్పాటైన ఈ ప్రదర్శన ఆకట్టుకుంటోంది. అలయన్స్ ఫ్రాంసీస్ మద్రాస్ అధ్యక్షుడు టీకే దుర్గా ప్రసాద్, ప్రవీణ్ కన్ననూర్ తదితరులు దీన్ని శుక్రవారం ప్రారంభించగా, ప్రముఖ సినీ దర్శకుడు మణిరత్నం, నటుడు పశుపతి, సీకే కుమార్‌వేల్, శరవణన్, మణియన్ సెల్వన్, గుహన్, సమీర్ భరత్‌రామ్ సహా పలువురు సినీ ప్రముఖులు, కార్పొరేట్, కళా రంగాలకు చెందిన నిష్ణాతులు పాల్గొన్నారు. 125కి పైగా కళా ప్రదర్శనల వారసత్వంపై నిర్మించబడిన ఫుట్ నోట్స్ ఆన్ సినిమా తోట తరణి జ్ఞాపకాలు, సినిమా పరిశీలనపై సన్నిహిత ప్రతిబింబాన్ని అందిస్తున్నాయి. తండ్రితో పాటు తన చిన్నతనంలో సినిమా సెట్లలో ఆయన చూసిన అనుభవాల కలయికతో ఇది రూపొందించబడింది. ఇందులో 25కి పైగా పెయింటింగులు ఉండగా, గత కాలం సినీ మాయాజాలాన్ని రేకెత్తిస్తున్నాయి. వీటిలో ఫిల్మ్‌సెట్‌లు, లైటింగ్, కెమెరా సిబ్బంది ఉన్నారు. ఇవన్నీ పాత తలుపులు, కిటికీ ఫ్రేమ్‌లు, కుర్చీలు, రూఫింగ్ ఎలిమెంట్స్ వంటి పునర్నిర్మించిన పదార్థాలను ఉపయోగించి తయారు చేసిన ఫ్రేమ్‌లపై ప్రదర్శించబడ్డాయి. స్కెచ్ పెన్నులతో గాఢ వస్త్రంపై రూపొందించబడిన స్కెచ్‌లు, సెల్యులాయిడ్ మంత్ర ముగ్ధతను స్పష్టంగా జీవం పోస్తున్నాయి. ఇవి దశాబ్దాల క్రితం సృష్టించబడిన చిన్న స్కెచ్‌లు. ఇన్నాళ్ల తరువాత వాటిని తిరిగి ఊహించుకుని పెద్ద ఎత్తున కళాకృతులుగా మార్చారు. అవి సినిమా సెట్‌ల ప్రతిరూపాలు కాకపోయినా వాటి నుంచి ప్రేరణ పొందిన కళాత్మక పునర్నిర్మాణాలు. ఈ నెల 14వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కళాకృతుల గుండెల్లో వారి సహకారం

ఈ ప్రదర్శన ప్రారంభోత్సవం సందర్భంగా తోట తరణి మాట్లాడుతూ.. ఈ ప్రదర్శన సినిమా కళలో గడించిన జీవితకాలాన్ని ప్రతిబింబిస్తుందని, ఈ చిత్రాల చుట్టూ పెరిగి, సినిమా సెట్లలో లెక్కలేనన్ని గంటలు గడిపిన తాను ప్రతి ఫ్రేమ్, ప్రతి సంజ్ఞ, కథకు ప్రాణం పోసే ప్రతి వివరాలను గమనించి, గ్రహించి, ప్రేరణ పొందానని వివరించారు. ఈ పని ద్వారా ఆ క్షణాలను కాన్వాస్‌పైకి అనువదించాలని, భారతీయ సినిమా సారాంశం, ఉత్సాహాన్ని సంగ్రహించాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు. ఈ ప్రదర్శనను కెమెరామెన్, అసిస్టెంట్ డైరెక్టర్లు, సిబ్బంది, తెర వెనుక అవిశ్రాంతంగా పని చేస్తున్న వారందరికీ అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. తరచుగా కనిపించని వారి సహకారం ఈ కళాకృతుల గుండెల్లో ఉందని పేర్కొన్నారు.

'అంగమ్మాళ్' ఫస్ట్‌లుక్ రిలీజ్



ప్రముఖ రచయిత పెరుమాళ్ మురుగన్ రాసిన చిన్న కథ ఆధారంగా 'అంగమ్మాళ్' పేరుతో సినిమా రూపొందుతోంది. స్టోర్ బెంచ్ ప్రొడక్షన్స్, ఎంజాయ్ ఫిలిమ్స్ ఫ్రో మూవీ స్టేషన్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.ఆన్‌లైన్‌లో విడుదలైన ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. పెరుమాళ్ మురుగన్ రాసిన 'కొడితుని' కథ ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు విపిన్ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో ప్రముఖ నటి గీతా కైలాసం నటిస్తున్నారు. చరణ్, భరణి, ముల్లైయరసి, తెండ్రల్ రఘునాథన్ ఇతర తారాగణం. ఈ సందర్భంగా పెరుమాళ్ మురుగన్ మాట్లాడుతూ... 25 నిమిషాల లఘుచిత్రంలో ఇమిడిపోయే తన కథను దర్శకుడు విపిన్ రాధాకృష్ణన్ మరిన్ని అంశాలను చేర్చి ప్రేక్షకులను ఆకట్టుకునేలా పూర్తి నిడివి చిత్రంగా మార్చారని ప్రశంసించారు. ఈ చిత్రానికి మహమ్మద్ మక్బూల్ మన్సూర్ సంగీతం సమకూర్చారు.

చిత్రజ్యోతి

ప్రభుదేవా, వడివేలు కాంబినేషన్ స్పెషల్ పోస్టర్ విడుదల



ప్రభుదేవా, వడివేలు కాంబినేషన్‌లో కొత్త చిత్ర నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 'డార్లింగ్, 100, ఎనక్కు ఇన్నొరు పేర్ ఇరుక్కు' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన శామ్ ఆంటన్ ఈ మూవీకి డైరెక్టర్. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. ప్రభుదేవా, వడివేలు గతంలో 'కాదలన్, ఎంగల్ అన్నా, మనదై తిరుడివిట్టాయ్, మిస్టర్ రోమియో' తదితర సినిమాల్లో నటించారు. ప్రభుదేవా దర్శకత్వం వహించిన 'పోకిరి, విల్లు' ల్లో వడివేలు నటించారు. ఈ నేపథ్యంలో మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన ఈ చిత్రం స్పెషల్ పోస్టర్ వెలువడి కోలీవుడ్‌లో కలకలం సృష్టిస్తోంది. ఇంకా పేరు పెట్టని ఈ చిత్ర విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని దర్శకుడు శామ్ ఆంటన్ తెలిపారు.

భారతిరాజా కులాసాగానే ఉన్నారు!



భారతిరాజా, నటి రాధా

తమిళ చిత్రసీమలో వరుసగా ఐదు సిల్వర్ జుబ్లీ మూవీలను అందించిన మేటి దర్శకుడు భారతిరాజా. ఈ మధ్య కుమారుడు మనోజ్ మృతి చెందడంతో మానసికంగా కుంగిపోయి ఇంటిపట్టునే గడుపుతున్న భారతిరాజా పాత సంగతులు అన్నింటినీ మరచిపోయి వైరాగ్యంతో ఉన్నారంటూ వదంతులు చెలరేగాయి. ఈ నేపథ్యంలో భారతిరాజా దర్శకత్వం వహించిన 'అలైగళ్ ఓయ్‌వదిల్లై' చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమైన ప్రముఖ నటి రాధా ఇటీవల చెన్నై నీలాంగరైలో ఉన్న ఆయన నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఆ సందర్భంగా ఇద్దరు పాత సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ విషయమై రాధా మాట్లాడుతూ... భారతి రాజా శారీరకంగా చాలా బలహీనంగా ఉన్నప్పటికీ మానసికంగా చాలా పటిష్ఠంగానే ఉన్నారన్నారు. తను నటించిన సినిమాలు గురించి, షూటింగ్ స్పాట్లలో జరిగిన పాత సంగతులు గురించి మాట్లాడటం తనకు చాలా ఆశ్చర్యమేసిందన్నారు. ఏది ఏమైనప్పటికీ భారతిరాజా తనయుడు మనోజ్ మృతిని తట్టుకోలేక దిగులుతో ఇంటిపట్టునే ఒంటరిగా గడుపుతున్నారే తప్ప ప్రసార మాధ్యమాల్లో పేర్కొన్నట్లు మానసికంగా కుంగిపోలేదని రాధ స్పష్టం చేశారు.



ఉపకారవేతనాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

● విద్యా ఉపకార వేతనాల పంపిణీ

ప్యారీస్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ (టీఏవీఎంఎస్) మద్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్యారీస్ గోవిందప్పనాయకన్‌వీధిలో ఉన్న ఆర్య వైశ్య ప్రసూతి ఆస్పత్రి ప్రాంగణంలో టీఏవీఎంఎస్ మద్రాస్ యూనిట్ తరుఫున 49వ వార్షిక సేవా కార్యక్రమాలు సంస్థ చైర్‌పర్సన్ ప్రశాంత్ సతీష్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో నిర్వహించిన శిబిరంలో రక్త, ఎముకలు, ఊపిరితిత్తులు తదితర పరీక్షలు, మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల, కళాశాల, ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుకుంటున్న 300 మంది విద్యార్థులకు రూ.2,5000 విలువైన ఉపకారవేతనం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మల్లికా ప్రకాష్, సెక్రటరీ భార్గవి, ట్రెజరర్ ప్రసన్న సహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తాటికొండల వత్సల రామచంద్రన్ ఫౌండేషన్ నిర్వాహకులు రాజేంద్రన్ రూ.50వేలు, వ్యాపారవేత్త బి.గౌతమ్ రూ50వేలు ఈ సంస్థ సేవా పథకాల నిమిత్తం విరాళంగా అందజేశారు.

ప్రజా నమ్మకం కోల్పోయిన డీఎంకే

● పీఎంకే నేత అన్బుమణి విమర్శ

ప్యారీస్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం చూపిన డీఎంకే ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమి చిత్తుగా ఓడిపోతుందని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి విమర్శించారు. సేలం జిల్లా వాలప్పాడి సమీపంలోని కుమారపాళయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మలినాలతో నిండి కాలుష్యమయంగా మారిన వశిష్ఠ నదిని శనివారం ఉదయం స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... మేట్టూరు డ్యాం ప్రధాన కాలువల్లో విడుదల చేస్తున్న అదనపు జలాలు సరబంగా నదితో విలీనం చేసి వశిష్ఠ నదికి మళ్లించడం వల్ల ఈ ప్రాంతంలో అన్నదాతల కష్టాలు తొలగుతాయన్నారు. ముఖ్యంగా పొలాలకు సమృద్ధిగా నీరు అందడంతో పాటు తాగునీటి కొరత తీరుతుందన్నారు. అయితే డీఎంకే ప్రభుత్వం ఈ నాలున్నరేళ్లలో ఈ నదిని శుభ్రపరిచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. భారతదేశంలో ప్రవహిస్తున్న 620 నదుల్లో 37 నదులు కలుషితమయ్యాయని, వీటిలో తమిళనాడులోని ఐదు ప్రధాన నదుల్లో సేలం జిల్లాలో ఉన్న తిరు మణిముత్తారు, సరబంగా, వశిష్ఠ నదులు ఉండటం ఆందోళన కల్గిస్తోందన్నారు. డీఎంకే పాలనలో రోజుకో అవినీతి వెలుగుచూస్తోందన్న అన్బుమణి, గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ప్రజలకు ఇచ్చిన 505 హామీల్లో ఇప్పటివరకు 13 మాత్రమే పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాయన్నారు. దీన్ని బట్టి పాలకుల వైఖరి ప్రజలు గ్రహించారన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో రూ.200 కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై సీబీఐ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్బుమణి తెలిపారు.



పీఎంకే నేత అన్బుమణి

మహాయజ్ఞంలా సమతా ఇష్టి

6న ప్రారంభించనున్న త్రిదండి చిన్నజీయర్‌స్వామి



ప్యారీస్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): సమత్వ, శాంతి, సౌఖ్యాభివృద్ధి కోసం సాప్తాహ్నిక పంచ కుండాత్మక 'సమతా ఇష్టి' ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నగరంలో వారం రోజుల పాటు మహాయజ్ఞంలా నిర్వహించనున్నారు. స్థానిక పెరంబూర్‌లో ప్రసిద్ధి చెందిన ఎస్పీఆర్ సిటీ వేదికగా 6వ తేది గురువారం సాయంత్రం 6 గంటలకు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి చేతుల మీదుగా జరగనుంది. ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకు సుదర్శన నృసింహ ఇష్టి, వైనతేయ ఇష్టి, వాయగ్రీవ ఇష్టి, పరమేష్టి (ధన్వంతరి హోమం), విష్వక్సేన ఇష్టి, లక్ష్మీనారాయణ ఇష్టి, చివరి రోజు లోకకల్యాణార్థం, శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ పూజలతో పాటు గోపూజా, లక్ష్మీపూజ, వేంకటేశ్వరపూజ, తీర్థగోష్ఠి, పూర్ణాహుతి, విష్ణుసహస్రనామ పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనం, తిరుమంజనం, నామసంకీర్తనం, రామానుజ నూట్రాండి సామూహిక పారాయణం, ఆధ్యాత్మిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతాయి. అలాగే మంత్రదీక్ష, శోభాయాత్ర, మహాపూర్ణాహుతి కార్యక్రమాలుంటాయి. తమిళ పురటాసి నెల ప్రారంభమైన సెప్టెంబర్ 17 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ప్రతిరోజు భక్తులు తమ ఇళ్లలో శక్తికొలది శ్రీమన్నారాయణుడిని స్మరించుకుంటూ పాత్రలో చేర్చిన బియ్యపు గింజలను మహాయజ్ఞంగా నిర్వహించనున్న సమతా ఇష్టిలో ప్రదర్శించి పూజలు నిర్వహిస్తారు. అలాగే భక్తులు స్వహస్తాలతో పెరుమాళ్లు, భగవద్రామానుజులకు తిరుమంజనం నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. చిన్నజీయర్ స్వామి మంగళాశాసనాలతో సమతా ఇష్టి సేవా కమిటీ సహకారంతో నిర్వహించనున్న ఈ వైభవంలో దేశంలోని సుమారు 3వేలకు పైగా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొంటారని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)-చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్‌రెడ్డి, నిర్వాహకులు తెలిపారు. శ్రీమన్నారాయణస్వామివారి ఆశీస్సులు పొందేందుకు కుల,మతాలకు అతీతంగా భక్తులందరూ తరలిరావాల్సిందిగా నిర్వాహకులు పిలుపునిచ్చారు.

రాజరాజ చోళుడికి ప్రభుత్వం తరఫున నివాళి



ఊరేగింపులో పాల్గొన్న ఓదువర్లు, తంజావూరు జిల్లా ప్రజలు




ప్యారీస్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన తంజావూరు బృహదీశ్వరాలయాన్ని నిర్మించిన చోళ సామ్రాజ్య చక్రవర్తి రాజరాజ చోళుడి 1040వ సదయ వేడుకల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం, ఎంపీ మురసొలి, మేయర్ రామనాథన్ సహా పలువురు ఉన్నతాధికారులు శనివారం ఘన నివాళులర్పించారు. అనంతరం ఆలయ ఉద్యోగులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత పరమశివుడిని కీర్తించే కీర్తనలు కలిగిన తిరుముర్రై గ్రంథాలను గజరాజుపై తిరువీధుల్లో నేత్రపర్వంగా ఊరేగించారు. హిందూ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కవిత, మాసిలామణి దేశికామణి జ్ఞాన సంబంధర్ పరమాచార్యస్వామి తదితర ప్రముఖులతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 9.30 గంటలకు బృహదీశ్వరాలయంలో కొలువుదీరిన పెరువుడయార్ సమేత పెరియనాయకి అమ్మవారికి పసుపు, గంధం, పాలు, పెరుగు, నారికేళ జలం తదితర 32 రకాల సుగంధ ద్రవ్యాలతో మహా అభిషేకాన్ని ఓదువర్లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 1040వ సదయ వేడుకలను పురస్కరించుకుని 1040 మంది ఓదువర్లు, పలు హిందూ సంస్థల ప్రతినిధులు, దేవాలయాలకు చెందిన పూజారులు, నిర్వాహకులు ఊరేగింపులో పాల్గొని రాజరాజ చోళచక్రవర్తి సేవలను కొనియాడారు. సదయ వేడుకల సందర్భంగా తంజావూరు జిల్లాకు ఐచ్ఛిక సెలవు ప్రకటించారు. పలు జిల్లాల కేంద్రాల నుంచి తంజావూరుకు రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడిపాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 300 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి కోరిక

● రైల్వే మంత్రిత్వ శాఖ సత్వర ఆమోదం

● కోవై, తిరుప్పూర్, ఈరోడ్, సేలంలకు అదనపు హాల్ట్

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎర్నాకుళం - బెంగళూరు మధ్య నడుస్తున్న వందే భారత్ కోవై, ఈరోడ్, తిరుప్పూర్, సేలం రైల్వే స్టేషన్లలో ఆగి వెళ్లనుంది. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సత్వర చర్యలు చేపట్టారు. ఈ ప్రకటనపై వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కోయంబత్తూర్‌లో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పర్యటించారు. ఆ సమయంలో ఉప రాష్ట్రపతిని కలుసుకున్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు... ఎర్నాకుళం - బెంగళూరు వందే భారత్‌కు కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం రైల్వేస్టేషన్‌లలో హాల్ట్ కల్పించాలని కోరారు. ఈ విషయమై ఉప రాష్ట్రపతి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి తెలియజేశారు. ఉప రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్ తొలి కోరిక కావడంతో, ఎర్నాకుళం-బెంగళూరు మధ్య నడిచే వందే భారత్‌కు కోవై, తిరుప్పూర్, ఈరోడ్, సేలం రైల్వే స్టేషన్లలో హాల్ట్ వసతి కల్పించినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.




చెన్నై కారపాక్కం వద్ద మెట్రోరైలుమార్గం నిర్మాణ ప్రాంతంలోని ఒక్కియం వాగు కాల్వ మరమ్మతులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

కన్నగినగర్‌లో కబడ్డీ మైదానం

పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి



కబడ్డీ మైదానం పనులు పరిశీలిస్తున్న ఉదయనిధి తదితరులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్నగి నగర్‌లో ఉన్న కార్పొరేషన్ పార్కులో రూ.40 లక్షలతో ఏర్పాటుకానున్న కబడ్డీ మైదానం పనులను శనివారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పరిశీలించారు. ఇటీవల టెహరాన్‌లో జరిగిన ఆసియా యూత్ గేమ్స్‌లో కబడ్డీ పోటీల్లో భారత్ తరఫున పాల్గొన్న పురుషులు, మహిళా జట్లు బంగారు పతకం కైవసం చేసుకున్నాయి. ఈ రెండు జట్లలో రాష్ట్రానికి చెందిన అభినేష్, కార్తీక తదితరులు దేశానికి బంగారు పతకం దక్కడంలో కీలకపాత్ర పోషించారు. బంగారు పతకం సాధించి రాష్ట్రానికి తిరిగొచ్చిన రోజే ముఖ్యమంత్రి స్టాలిన్ వారిద్దరిని పిలిపించి అభినందించడంతో పాటు తలా రూ.25 లక్షలు అందజేశారు. కన్నగి నగర్‌కు చెందిన కార్తీక విజయాన్ని ఆ ప్రాంత ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. ఈ క్రమంలో, కన్నగి నగర్‌లో ఉన్న కార్పొరేషన్ పార్కులో రూ.40 లక్షలతో ఏర్పాటుకానున్న కబడ్డీ మైదానం పనులను ఉదయనిధి పరిశీలించారు. ఈ విషయమై ఆయన తన ఎక్స్ పేజీలో.. 'కబడ్డీ క్రీడాకారిణి కార్తీకేయ అపూర్వ సాధనతో కన్నగినగర్ పేరు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మార్మోగుతోంది. కన్నగి నగర్ కార్పొరేషన్ పార్కులో చేపట్టిన కబడ్డీ మైదానం నిర్మాణపనులు శనివారం స్వయంగా పరిశీలించా. వర్షం, ఎండ గురించి కబడ్డీ క్రీడాకారులు ఆందోళన చెందకుండా శిక్షణ పొందేలా ఈ ఇండోర్ స్టేడియం దోహదపడనుంది. కార్తీక లాంటి క్రీడాకారులను తయారుచేసేలా ఈ మైదానం ఉంటుంది' అంటూ ట్వీట్ చేశారు. ఉప ముఖ్యమంత్రి వెంట మేయర్ ప్రియ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారను.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ ముడగల్, తెలంగాణ రాష్ట్ర మంత్రి వి.శ్రీహరి దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





మంత్రి శ్రీహరి - జస్టిస్ ముడగల్

త్యాగమే సేవకు మూలం

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఎస్పీ సుబ్బరాయుడు


విద్యార్థులు, పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రశంసాపత్రాల పంపిణీ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): త్యాగమే సేవకు మూలమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పోలీసు అతిథిగృహం కాన్ఫరెన్సు హాలులో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి, వారి పిల్లలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో యువత, పోలీసు సిబ్బంది దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగ భూషణరావు,డీఎస్పీలు శ్రీలత, శ్యాం సుందర్, ఆర్ఐ హరికృష్ణ, పోలీసు అసోషియేషన్ నాయకులు సోమశేఖర్, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


గురువారం హుండీ ఆదాయం: రూ.3.76 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,539

తలనీలాలు సమర్పించినవారు: 23,144

రైతులకు వరం కారాకొల్లు కషాయం





- నేల సురక్షితం.. దిగుబడి అధికం.. కలుపు మాయం
- గ్రామీణశాస్త్రవేత్తల పరిశోధనా ఫలితం

SUNDAY SPECIAL

తొట్టంబేడు మండలం కారాకొల్లు గ్రామానికి చెందిన రైతు గల్లా చంద్రశేఖర్ నాయుడు, ఆయన మిత్ర బృందం నాలుగు దశాబ్దాలుగా పలు పరిశోధనలు చేస్తున్నారు. నేలతల్లిని కాపాడుకునే దిశగా వీరు చేస్తున్న పరిశోధనలు మంచి ఫలితాలను ఇచ్చాయి. మూలికా విధానం ద్వారా నెమటోడ్స్ (వేరు పురుగు)ను నివారించే మందును 2012లో కనిపెట్టారు. దీనికి నెమ్‌జాప్ అని పేరు పెట్టారు. 2020లో అహ్మదాబాద్ సృష్టి ల్యాబ్స్ నుంచి దీనికి పేటెంట్ కూడా పొందారు. ఇక కలుపు నివారణ కోసం వీడ్ జాబ్, పంట ఎదుగుదల కోసం గ్రోత్ ఫిట్ కషాయాలను రూపొందించారు. ఈ రెండింటితో పాటు మరికొన్ని ఉత్పత్తులు కలుపుకుని మొత్తం పదింటికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

- కథనం : శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

25 వేల ఎకరాలకు కారాకొల్లు మందులు

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తల మిత్ర బృందం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో ప్రస్తుతం ఈ మందులను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. యూరియా పొటాషియంలకు ప్రత్యామ్నాయం కావడంతో గ్రోత్ ఫిట్ మందు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. కలుపు నివారిణి వీడ్‌జాబ్ మంచి ఫలితాలను ఇస్తోంది. దీంతో తెలంగాణలో సుమారు 5వేల మంది రైతులు పదివేల ఎకరాల్లో ఈ రెండు ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంలో 6 వేల మంది రైతులు 12 వేల ఎకరాల్లో కారాకొల్లు కషాయాలను వాడుతున్నారు. సరిహద్దుల్లోని తమిళనాడు, కర్ణాటక నుంచి వీరి మందుల కోసం అడుగుతుంటారు. ఏడాదికి 40 వేల లీటర్ల మందులను వీరు ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు.

శ్రీకాళహస్తిలోని కషాయాల తయారీ బాధ్యతలన్నీ కారాకొల్లు రైతులే చూస్తున్నారు. గ్రామ్‌బజార్ అనే యూట్యూబ్ చానెల్ వీరి మందుల గురించిన సమాచారం వీడియోల రూపంలో పెడుతూ ఉంటుంది. ఈ మందులు వాడుతున్న రైతుల అనుభవాలను, పంటల తీరును చూపిస్తుంటారు.

కారాకొల్లు కషాయాలు కావాలంటే:
www.gramabazaar.com
వరిలో కొనుగోలు చేస్తే ఆర్టీసీ పార్శిల్ ద్వారా పంపుతారు.
వివరాలకు:
9849541674

కారాకొల్లు మందులు





వీడ్‌జాప్: వరిలో కలుపు నివారణకు అద్భుత ఫలితాలనిస్తోంది. ఎకరాకు మూడు లీటర్ల మందు అవసరం. ఇది లీటరు రూ.600

వాడే విధానం: వరి నాట్లకు ముందు నీళ్లు పెట్టి దమ్ము చేసుకునే సమయంలో ఈ మందును ఇసుకలో కలిపి చల్లాలి. వరి నాటుకున్న తర్వాత అందులోని నీళ్లు 15 రోజుల పాటు బయటకు పోనివ్వకుండా చూసుకోవాలి.

ప్రయోజనం: వరిలో సాధారణంగా వచ్చే ఏ రకమైన కలుపూ ఎదగదు. పైగా మొలిచిన కలుపును ఇది చంపేసి ఎరువుగా మార్చేస్తుంది.

గ్రోత్‌ఫిట్: ఇది మంచి పోషకం. వరి సహా అన్ని పంటలకూ వాడవచ్చు. వరి అయితే ఎకరాకు మూడు లీటర్లు అవసరం. లీటరు రూ.600.

వాడే విధానం: వరి నాటిన 25రోజులకు రెండు లీటర్ల మందు ఇసుకలో కలిపి చల్లాలి. ఆ సమయంలో పొలంలో నీళ్లు ఉండాలి. వరి వెన్ను వచ్చే ముందు అంటే 35 రోజులకు ఒక లీటరు మందులో 100లీటర్ల నీళ్లు కలిపి స్ప్రే చేయాలి. వరి 5నెలల పంట అయితే ఇంకోసారి 2లీటర్ల మందు వేయాలి.

ప్రయోజనం: పొలం పచ్చగా నిగనిగలాడుతూ ఎదుగుతుంది. వెన్ను బలంగా వస్తుంది. గింజ రాలదు. దిగుబడి పెరుగుతుంది.

నెమ్‌జాప్: వేరుపురుగును నివారించే ఈ మందు వరి, మామిడి తప్ప అన్ని రకాల పంటలకీ వాడుకోవచ్చు. కూరగాయల తోటల్లో ఇది మంచి ఫలితాలను ఇస్తోంది. ఎకరాకు రెండు లీటర్ల మందు అవసరం. లీటరు ధర రూ.800. దీనికి పేటెంట్ కూడా లభించింది.

వాడే విధానం: పంట వేసే ముందు ఇసుకలో కలిపి చల్లుకోవాలి. పంట వేశాక అయితే ఒక లీటరు మందును వందలీటర్ల నీళ్లలో కలిపి డ్రిప్‌లో వదలాలి.

ఈ మందు వాడిన 15రోజుల తర్వాత గ్రోత్ ఫిట్ స్ప్రే చేస్తే పూతవిరగ్గాస్తుంది. కాయ సైజు పెరుగుతుంది. నాణ్యత ఉంటుంది.

నొప్పి నివారిణి శ్రీతైలం

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు తయారు చేసిన శ్రీతైలం పెయిన్ రిలీవర్‌గా ఉపయోగపడుతుంది. ఇది కూడా పూర్తిగా ఆకు పసరు నుంచి తయారు చేసిందే. నొప్పి ఉన్న చోట పూసుకుంటే చాలు. అలాగే పడుకునే ముందు ఒంటికి పూసుకుంటే దోమలు దగ్గరకు కూడా రావు. గాయాలకు పూస్తే వేగంగా నయమవుతాయి. సోరియాసిస్ తప్ప అన్ని రకాల చర్మ వాధులకు ఇది మంచి ఫలితాలు ఇస్తోందని గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్ చెబుతున్నారు.

ఎరువులకన్నా ఖర్చు తక్కువ

యూరియా, పొటాషియం, డీఏపీ వంటి రసాయన ఎరువులను సాధారణంగా రైతులు వినియోగిస్తారు. కలుపు నివారణకు మందులు చల్లుతారు. వీటికి ఎకరా వరికి రూ.6వేలు ఖర్చవుతుంది. చీడపీడల పురుగు మందుల కోసం రూ.8,400 వ్యయం చేయాలి. అంటే ఎకరా వరికి రూ.14,500లు ఖర్చు అవుతుంది. అదే కారాకొల్లు కషాయాలు వాడితే కేవలం రూ.3600తో ఎకరా వరి సాగవుతుంది.



వయ్యారిభామపై యమపాశం

వయ్యారిభామ, కాంగ్రెస్ గడ్డి, పార్థీనియం వంటి పేర్లతో పిలిచే పిచ్చి మొక్క తీవ్ర అనారోగ్యాలకు కారకమని గుర్తించి దీన్ని అణుబాంబుతో పోలుస్తారు. కారాకొల్లు శాస్త్రవేత్తలు తయారుచేసిన కలుపుమందును చల్లగానే అర గంట వ్యవధిలో వయ్యారిభామ నిలువునా మాడిపోతుంది. ఇది తర్వాత అదే నేలకు ఎరువుగా మారిపోతుంది. ఈ మందు కూడా మన చుట్టూ లభించే పిచ్చిమొక్కల నుంచే తయారు చేయడం విశేషం. రైతులకు మరింత లాభదాయకంగా ఉండేలా ఈ మందుపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

40 ఏళ్ల క్రితం నేను, భాస్కర్, బత్తినాయుడు, మురళి, వెంకటేశ్వర్లు, శివయ్య, చిరంజీవులు, శ్రీధర్ అనే ఏడుగురు మిత్రులు కలిసి ప్రారంభించిన పరిశోధనల ఫలితమే ఇవి. రసాయన ఎరువులు, పురుగుమందులు భూమి కడుపులో విషంగా మారి మన ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయని అందరికీ తెలుసు. ప్రత్యామ్నాయంగా సేంద్రియ సేద్యాన్ని సూచిస్తున్నారు. గడ్డి, ఆకులు వంటివి మేతగా స్వీకరించే పశువుల విసర్జితమే ఈ సేద్యంలో కీలకం. నేలలో మిత్రకీటకాల వృద్ధికి దోహదం చేస్తున్నది ఇదే. పశువులు స్వీకరించి విసర్జించిన తర్వాత ఏర్పడే సేంద్రియ గుణాలను కలిగివున్న మొక్కలపై దశలవారీగా మేం చేసిన పరిశోధనల్లోంచే గ్రోత్‌ఫిట్, నెమ్‌జాప్, వీడ్‌జాబ్ వంటివి తయారయ్యాయి. ఇంకా చవగ్గా రైతులకు అందించేలా ఇప్పటికీ మా పరిశోధనలు కొనసాగుతున్నాయి.

- చంద్రశేఖర్



పైరు బాగా పెరిగింది

మాది తొట్టంబేడు మండలం కొమ్మలగుంట గ్రామం. నాకున్న ఎకరా నేలలో తెలంగాణ నుంచి గౌతమ బుద్ధ అనే దేశవాళీ నాటు వరి విత్తనాలను కొనుగోలు చేశాను. ధాన్యం చూడ్డానికి నల్లగానూ.. అన్నం మామూలుగా తెల్లగాను ఉంటుంది. ఇది అరుదైన రకం కావడంతో కిలో బియ్యం రెండు వందల యాభై రూపాయలు చొప్పున మార్కెట్ ధర ఉంది. కారాకొల్లు కషాయాలు చల్లాను. వీడ్‌జాబ్‌తో అసలు కలుపు సమస్య రాకుండా... ఎరువుగా కూడా ఉపయోగపడి పైరు బాగా వచ్చింది. మధ్యలో గ్రోత్ ఫిట్ వినియోగించాను. పైరు బాగా ఎత్తుగా పెరిగింది.

- రాంబాబు





పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

రాష్ట్రస్థాయి లాన్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ టెన్నిస్ అకాడమీలో శనివారం 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ లాన్ టెన్నిస్ అండర్-14, అండర్ 17, అండర్-19 పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి జిల్లాకు 30మంది చొప్పున 390మంది క్రీడాకారులు ఈ పోటీలకు విచ్చేశారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెలలో డిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా స్కూల్ గేమ్స్ పోటీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్,ఏర్పేడు మండలాధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు,నాయకులు కాసరం రమేష్,రవీంద్రనాథ్‌రెడ్డి, కూటమి నాయకులు,తిరుపతి స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమే

- దెబ్బతిన్న ప్రాంతాన్నే పునర్నిర్మిస్తాం ● కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠాన్ని మొత్తంగా కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమేనని, దెబ్బతిన్న ప్రదేశాలను పునర్నిర్మిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి ప్రజాప్రతినిధులు, మఠం కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. పురాతనమైన హథీరాంజీ మఠం విషయంలో ఎక్స్పర్ట్ కమిటీని నియమించి వారి సలహాలు తీసుకున్నామని తెలిపారు. గాంధీ రోడ్డు వైపు ఉన్న భాగం దెబ్బతిందని, ఉత్తరం వైపు ఉన్న మొదటి అంతస్తు భాగం పూర్తిగా ధ్వంసమైందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ డైరెక్టర్ ఆర్ఎస్ఎస్ మూర్తి తెలిపారన్నారు. ఈ మఠాన్ని మద్రాస్ టెర్రస్ రూఫింగ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్వం నిర్మించారని, అదే తరహాలో పునర్నిర్మాణం చేస్తామని అన్నారు. త్వరగా పూర్తి చేసి, బంజారా భక్తులకు వసతిగృహం, వ్యాపారులకు దుకాణాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

కళలపైనా ఆసక్తి పెంచుకోండి

- బాలోత్సవ ప్రారంభోత్సవంలో కలెక్టర్ పిలుపు



తిరుపతి (కల్చరల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు కళలూ సాహిత్యం పట్ల కూడా ఆసక్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు.తిరుపతి నాల్గవ బాలోత్సవాన్ని నగరంలోని ఎస్వీఎస్ ఆర్ట్స్ కాలేజీలో శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో సృజనాత్మక శక్తి మెరుగుపడుతుందన్నారు.ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని,అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందని హామీ ఇచ్చారు.డీఈవో కుమార్,సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీయాలనే సంకల్పంతో విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.పిల్లల్లో సామాజిక స్పృహ , దేశభక్తి, సమష్టితత్వం పెంపొందించాలనే ఆశయంతో ఏటా ఈ కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, కస్తూరిబా గాంధీ ట్రస్టు చైర్మన్ పి.సి. రాయలు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్ర శెట్టి, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్ నాథ్ లింగుట్ల, క్రియా పిల్లల పండుగ సెక్రటరీ కాకినాడ జగన్నాథ రావు, ఎస్వీఎస్ కాలేజ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.





చిన్నారుల సందడి

- హుషారుగా సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు
- నేడు విజేతలకు బహుమతుల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):బాలోత్సవంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో అదరహో అనిపించారు.వేలాది మంది చిన్నారులు తమలోని సుకుమార భావాలను వ్యక్తం చేసి ఆహూతులను మైమరిపించారు.ఆరు సమాంతర వేదికలపై ఇరవై ఒక్క అంశాలపై పోటీలు నిర్వహించారు.ఫ్యాన్సీ డ్రెస్, బొమ్మకు కథ రాయండి, కథ చెబుతాను ఊ కొడతారా, కథ రాయడం, స్పెల్-బీ (ఇంగ్లీషు), గజిబిజి సరిచేద్దాం, మ్యాప్, మెమరీ టెస్ట్, తెలుగు దినపత్రిక పఠనం, లేఖారచన, బెస్ట్ ఫ్రం వేస్ట్, జానపద నృత్యం, ఇన్‌స్ట్రుమెంట్, బుర్రకథ, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి గీతాలాపన, లఘునాటిక, చదరంగం వంటి అంశాలపై ఆసక్తికరంగా పోటీలు సాగాయి.ఆదివారం చిత్రలేఖనం, పదకేళి (పదవినోదం), గణిత తర్కం, తెలుగులో మాట్లాడటం, తెలుగులో ఉపన్యాసం, పద్యం-భావం, క్విజ్, మట్టితో బొమ్మల తయారీ, సంప్రదాయ నృత్యం, దేశభక్తి గేయాలాపన, జానపద నృత్యం, కోలాట ప్రదర్శనం, యోగ, శాస్త్రీయ సంగీతం, జానపద గీతాలు, చెస్ తదితర పోటీలు నిర్వహించనున్నారు.సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ముగింపు సభకు ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున, అధ్యక్షులు నడ్డి నారాయణ తెలిపారు.

నేడు నారావారిపల్లెకు రోహిత్ దంపతుల రాక

చంద్రగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు కుమారుడు, సినీహీరో నారా రోహిత్ దంపతులు ఆదివారం స్వగ్రామమైన నారావారిపల్లెకు రానున్నారు. ఇటీవల హైదరాబాదులో రోహిత్ వివాహమైన సంగతి తెలిసిందే. నవ దంపతులు ఉదయం నారావారిపల్లెకు చేరుకుని, రామ్మూర్తినాయుడు ఘాట్‌కు నివాళులు అర్పించనున్నారు. గ్రామదేవత దొడ్డి గంగమ్మకు, ఇంటి దేవత నాగాలమ్మకు పూజలు నిర్వహించనున్నారు. అనంతరం హైదరాబాదుకు వెళ్లనున్నారు.

పీఎం ఆదర్శ గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు

- జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

తిరుపతి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం ఆదర్శ గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని, ప్రణాళిక సిద్ధం చేయాలని జెడ్పీసీఈవో వి.రవికుమార్ నాయుడు ఆదేశించారు. తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవోలు, పంచాయతీ, ఇరిగేషన్ విభాగాల ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం మూడు దశలలో రూ.10కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేపట్టాలని సూచించారు. రెండు సంవత్సరాల కాల పరిమితితో ఈ నిధులను వినియోగించుకోవచ్చన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్‌నాయుడు